

కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కాలనీల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ఓంకార్‌నగర్‌కాలనీ ఫేజ్-2లో ఏర్పాటు చేసిన కాలనీ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తూ కాలనీలను అభివృద్ధి చేస్తామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధే తన ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి

● యాకత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్



ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

సంతోష్‌నగర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని యాకత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే సుబ్రహ్మణ్యనగర్‌కాలనీలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కాలనీ సంక్షేమ సంఘాలు ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానని తెలిపారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు జయప్రకాశ్, ప్రసాదరావు, కేశవ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వనస్థలిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ రేడియోకాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలవారికి ఉపయోగపడే విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలన్నారు. అభివృద్ధి పనుల్లో కాలనీవాసులు తగు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారమే తన ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



దోమల నివారణ పిచికారి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

దోమల నివారణకు కాలనీవాసులు కృషిచేయాలి

వనస్థలిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో దోమలు ఏర్పడకుండా కాలనీవాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని కాప్రాయి చెరువుతో పాటు ఇతర ప్రాంతాల్లో దోమల నివారణలో భాగంగా దోమల నివారణ పిచికారి చేయించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలు వేయకుండా కాలనీవాసులు తగు చొరవ తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తి మూలంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వీటి నివారణకు ఏకైక మార్గం దోమలను అరికట్టడమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రవీందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ కార్తీక్, శానిటేషన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవీశరన్నవరాత్రులు



మాజీ కార్పొరేటర్, పోచమ్మ ఆలయ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సీఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. రానున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పోచమ్మ ఆలయం చుట్టూ రూ.4.3లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, సభ్యులతో కలిసి కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈసందర్భం గా నర్సింహారెడ్డి మాట్లాడుతూ భక్తులకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఈ సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాంపల్లి శంకరయ్య, పాతూరి శ్రీధర్‌గౌడ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి

● జెడ్సీ హేమంత్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ వినతి



జెడ్సీ హేమంత్ పాటిల్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తపేట డివిజన్ లో పాడైన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్ కుమార్ విన్నవించారు. గురువారం ఆయన జెడ్సీని కలిసి మారుతీనగర్, మోహన్‌నగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, బృందావన్ కాలనీల్లో రోడ్ల సమస్యలను వివరించారు. వరదనీటితో కొట్టుకొచ్చిన ఇసుక, మట్టి దారులపైకి చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టేలా సహకరించాలని ఆయన జెడ్సీని కోరారు.

సమస్యలు పరిష్కరిస్తా : సబితారెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన వినాయకహిల్స్ కాలనీవాసులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకుగాను త్వరలోనే తాను బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాలనీల్లో పర్యటిస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ ఫేజ్-2 కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రతినిధులు గురువారం మాజీ కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై ఆమెకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో గల రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలతో మమేకం కావడానికి గాను త్వరలో తాను కాలనీల్లో పర్యటనలు చేపడతానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో వినాయకహిల్స్ ఫేజ్-2 అధ్యక్షుడు వై.రాజవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి కె.శంకర్‌నాయక్, ఇతర ప్రతినిధులు, స్వేచ్ఛానివాస్ కాలనీవాసులు పాల్గొన్నారు.

15 నుంచి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



డిప్యూటీ కమిషనర్లతో సమీక్షా సమావేశంలో చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సొలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పాతబస్తీలోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో మలక్‌పేట, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నామా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ఎంకేఐ అలీ, సురేందర్, సరిత, అరుణకుమారి, సురేందర్‌రెడ్డి, యూసీడీ డీపీవోలు కరుణాకర్, యాదగిరిరావు, స్వాతిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. జోన్ పరిధిలోని 3,997 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఇందులో 39,773 మంది మహిళా సభ్యులున్నారని ఆయన వివరించారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని సర్కిళ్ల పరిధుల్లోని పలు ప్రాంతాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి 26 వరకు బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జోనల్ కమిషనర్ డిప్యూటీ కమిషనర్లను, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్లను ఆదేశించారు.

ప్రతి వ్యక్తి మానసిక స్థైర్యాన్ని ఏర్పరుచుకోవాలి

● జూనియర్ సివిల్ జడ్జి సల్మా ఫాతిమా



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సల్మా ఫాతిమా

హయత్‌నగర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ఆత్మహత్య ఒక్కటని హయత్‌నగర్ కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మా ఫాతిమా అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి మునగనూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న సమస్యలను తట్టుకోకుండా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆర్థిక, ప్రేమ వ్యవహారాలు, మానసిక ఒత్తిడి, ఒంటరి తనం, కుటుంబ తగాదాలు, వివిధ రకాల రుగ్మతలతో బాధపడి అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి వ్యక్తి మానసిక స్థైర్యాన్ని ఏర్పరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, న్యాయవాదులు నరేష్, రామ్మోహన్, కోర్టు సిబ్బంది లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రిన్సిపల్ జానకీరాములు, అధ్యాపకులు మేఘా, లక్ష్మీప్రతిభ, తబిత, శాంతి, నవ్య, భవాని పాల్గొన్నారు.

భూదాన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి



వినోభా బావే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భూదాన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. భూదాన ఉద్యమాల పితామహుడు ఆచార్య వినోభా బావే 130వ జయంతి కార్యక్రమాన్ని కుంట్లూర్ పరిధిలోని ఆర్ఎన్ఆర్‌కాలనీ భూపోరాట కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వినోభా బావే చిత్రపటానికి రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రతో భూస్వాముల ద్వారా సేకరించిన భూములను పేదలకు పంచిపెట్టిన ఆచార్య వినోబా బావే జీవితం అందరికీ ఆదర్శమన్నారు. రంగారెడ్డి జిల్లాలోని వేలాది ఎకరాల భూదాన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూస్వాములు కబ్జాలు చేశారని వారి కబ్జాల చెర నుంచి తిరిగి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కుంట్లూర్ భూదానభూముల్లో పేదలు గుడిసెలు వేసుకున్నారని వెంటనే వారికి తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, నర్సింహ, ప్రసాద్, వేణుగోపాలాచారి, గోపీ, రాములు, శోభన్, వీరేష్, సుధాకర్, నగేష్, నర్సింహ, వెంకట్ పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించండి

● అధికారులకు స్థానికుల వినతి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణారెడ్డి, సుల్తాన్‌పూర్‌వాసులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని సుల్తాన్‌పూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు మిధాని డిపో ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి ఆరు సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం దూరమయిందని, దాంతో తాము మల్లాపూర్ వరకు వెళ్లి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులను ఆశ్రయించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లాపూర్ నుంచి ఆర్‌సీఐ చౌరస్తా, పహాడీషరీఫ్ మీదుగా(సుల్తాన్‌పూర్ పక్క నుంచి) శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పలు బస్సులు తిరుగుతున్నా వాటిలో కనీసం ఒక్కటి కూడా తమ గ్రామంలోకి రావడంలేదని వారు వాపోయారు. ఆర్‌సీఐ-పహాడీషరీఫ్ రోడ్డు నుంచి సుల్తాన్‌పూర్‌కు కనెక్టివిటీ రోడ్డు ఉన్నప్పటికీ అధికారులు తమ గ్రామంలోకి బస్సులను పంపించడం లేదని వారు విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆర్‌సీఐ-పహాడీషరీఫ్ మధ్యలో నడిచే అన్ని బస్సులను సుల్తాన్‌పూర్ మీదుగా మళ్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, రావుల మల్లేశ్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, సుల్తాన్‌పూర్‌వాసులు ఎన్ను యాదిరెడ్డి, రామాచారి, కళ్లెం మురళీధర్‌రెడ్డి, రవి, మల్లేశ్, నర్సింహ, కిరణ్‌రాజ్, జోగయ్య, దేవమ్మ, జయమ్మ, వీరమ్మ, క్రిష్ణవేణి, యాదమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

రమణాచార్యులకు డాక్టరేట్

మల్కాజిగిరి: యువకవి, మల్కాజిగిరి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు, అక్షరకౌముదీ సంస్థ వ్యవస్థాపకుడు తులసి వెంకటరమణాచార్యులకు ఉస్మానియా డాక్టరేట్ లభించింది. మనసచెన్నప్ప రచనలు పరిశీలనపై డాక్టర్ చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేసి మనసచెన్నప్ప పరిశీలన అనే సిద్ధాంత గ్రంథాన్ని ఓయూకు సమర్పించారు. పరిశీలించిన ఓయూ విభాగాధిపతులు తులసికి త్వరలోనే డాక్టరేట్‌ను ప్రదానం చేస్తామని చెప్పారు. డాక్టరేట్ రావడంపై రమణాచార్యులు సంతోషం వ్యక్తం చేశారు.

బైకు ఢీకొని పండ్ల వ్యాపారి మృతి

మన్సూరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్ట బాబానగర్‌కు చెందిన మహమ్మద్ ఖాజామైనోద్దీన్(70) నాగోల్‌లోని బండ్లగూడలో నిత్యం తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. రోజు మాదిరిగానే బుధవారం వ్యాపారం ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. రాత్రి సుమారు 8గంటల సమయంలో నాగోల్ మెయిన్‌రోడ్డుపై భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలో తోపుడుబండిని నిలిపి రోడ్డును దాటి ఎదురుగా ఉన్న టీస్టాల్‌లో చాయ్ తాగేందుకు వెళ్లి మళ్లీ రోడ్డును దాటుతున్నాడు. ఈ క్రమంలో అటుగా అతి స్పీడ్‌గా వస్తున్న ఓ గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఖాజామైనోద్దీన్‌ను ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన క్షతగాత్రుడైన వృద్ధుడిని వెంటనే స్థానికులు ఉస్మానియాకు తరలించగా పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. ఈ మేరకు మృతుడి కుమారుడు వాయిద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు బైక్ ఢీ : యువకుడి దుర్మరణం



సందీప్(ఫైల్)



కాలు విరగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఅండ్‌టీ కాలనీకి చెందిన జి.సందీప్(31) కొత్తపేటలోని బర్గర్‌కింగ్‌లో పనిచేస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి విధులు ముగించుకున్న అనంతరం తన స్నేహితుడు పవన్‌తో కలిసి బైక్(నెం.ఎపి11ఎసి4779)పై కొత్తపేట నుంచి ఇంటికి వెళ్తున్నారు. అయితే విక్టోరియా మెమోరియల్ మెట్రోస్టేషన్ (పిల్లర్ నెం.1631) వద్ద బైక్ యూటర్న్ చేసుకుంటుండగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్తు న్న ఎర్టిగా కారు(టీఎస్ 8 యూ 4557)వేగంగా దూసుకువచ్చి సందీప్, పవన్‌లు వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో వారిద్దరు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. పవన్ కాలు విరిగి రోడ్డుపై పడిపోయింది. స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సందీప్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. పవన్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వాహనాన్ని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపిన కారు డ్రైవర్ నాగరాజుపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆయన కుటుంబ సభ్యులు

మర్యాదపూర్వక కలయిక

మన్సూరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బెంగళూరులోని విధాన్ సౌధలో గురువారం కుటుంబ సభ్యులతో కలిసి డీకే శివకుమార్‌ను కలిసిన ఉప్పల ఆయనతో కొద్ది సమయం ముచ్చటించినట్లు పేర్కొన్నారు. రాజకీయంగా డీకే ఇచ్చిన పలు సూచనలు, సలహాల పట్ల శ్రీనివాస్‌గుప్తా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా సతీమణి ఉప్పల స్వప్న, కుమారులు ఉప్పల సాయికిరణ్, ఉప్పల సాయితేజ, కోడలు శర్వరీసాయికిరణ్ పాల్గొన్నారు.



గణపతి మూలమంత్ర హోమం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా గణపతి హోమం

కొత్తపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తులు స్వామివార్లకు విశేష పూజలు చేయించారు. విజయ గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా గణపతి మూలమంత్ర హోమం నిర్వహించారు. అర్చకస్వాములు శాస్త్రోక్తంగా, వేద మంత్రాలతో హోమం చేశారు. తొలుత మండపారాధన తర్వాత విజయ గణపతిస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్నేహపురికాలనీ, పరిసరకాలనీ భక్తులు హోమం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరం

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి అన్నారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యంతాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 58 మంది మద్యంప్రియులకు 58మంది కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో 4విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యంమత్తులో వాహనాలు నడిపితే చోటు చేసుకున్న ప్రమాదాల సీసీ కెమెరాల క్లిప్పింగ్స్, సిబ్బంది రమేష్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య మాట్లాడుతూ వాహనదారుల సంరక్షణ కోసమే డీడీ తనిఖీలు నిర్వహిస్తున్నారని, నిబంధనల ప్రాధాన్యతను గుర్తు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించొచ్చు

కొత్తపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించొచ్చని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ తెలిపారు. గురువారం రామాంతపూర్ జడ్పీహెచ్ఎస్ నుండి 45 మంది విద్యార్థులు పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. అధికారులు వారికి అర్థమయ్యేలా నిబంధనల ప్రాధాన్యత తెలిపే యానిమేషన్ చిత్రాలు ప్రదర్శించారు. వాహనాలు నడిపే వేళ, వాహనాల్లో ప్రయాణించు సమయంలోనూ నిబంధనలు పాటించాలన్నారు. తుర్కయంజాల్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో 533 మంది విద్యార్థులకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని వారు తెలిపారు. విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో 16 కార్యక్రమాలు నిర్వహించామన్నారు.



ఆర్‌కెపురం డివిజన్ పరిధిలోని మార్గదర్శికాలనీ కమ్యూనిటీ హాల్, టెలిఫోన్‌కాలనీ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ డివిజన్ సీనియర్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డిలు సొంత నిధులతో నిర్మించిన వాష్‌రూమ్స్‌ను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కెఎల్ ఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా అవసరాలకు అనుగుణంగా సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన చిలుక మధురఉపేందర్‌రెడ్డిలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

రైలు ఎక్కబోతూ జారిపడి వ్యక్తి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నడుస్తున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన హనుమంతు కుమారుడు జోగిఎర్రి స్వామి (41) బుధవారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. కదులుతున్న ఎల్లంకి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోయి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో రైల్వే పోలీసులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలులో బంగారు ఆభరణాల చోరీ

రైలు ప్రయాణికుడి బంగారు ఆభరణాలను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. నగరానికి చెందిన ప్రవీణ్‌కుమార్ బికనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మహారాష్ట్రలోని మోత్కేడ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆయన బ్యాగును దొంగలు తస్కరించారు. ఈ బ్యాగులో 12 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆధార్ కార్డు ఉన్నాయి. గురువారం ప్రవీణ్‌కుమార్ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

కిలిమంజారో అధిరోహకుడికి సత్కారం

రాంనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి, రికార్డు సృష్టించిన నగరానికి చెందిన పర్వతారోహకుడు ఎ.మనీష్‌యాదవ్‌ను గురువారం టీడీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా, నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, కిరణ్, శ్రీనివాస్‌నాయుడు, శుక్లవేది, యాదగిరి పాల్గొన్నారు.